


రోగులకు పరీక్ష





- రిమ్స్‌లో వైద్య సిబ్బంది కమీషన్ల కక్కుర్తి
- పలు వైద్య పరీక్షల కోసం'ప్రైవేటు'కు
- ఉచిత వైద్యం అందక రోగుల జేబులకు చిల్లు

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వంద పడకలతో ప్రారంభమై ప్రస్తుతం వెయ్యి పడకలకు చేరుకుంటూ దినదినాభివృద్ధి చెందుతున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రోగులకు ఉచిత వైద్యం అందించడంలో మాత్రం విఫలమైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిమ్స్‌ను నిత్యం వేలాది మంది రోగులు సందర్శిస్తుంటారు. ప్రతిరోజు సుమారు 1,600 నుంచి 1,800 దాకా ఓపీ ఉంటుంది. ఓపీ వరకు పర్వాలేదు గానీ, చికిత్స కోసం ఆస్పత్రిలో అడ్మిట్ అయితే మాత్రం జేబుకు చిల్లు పడాల్సిందే. పలు రకాలైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేటు ల్యాబుల వైపు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

నిర్ధారణ పరీక్షల కొరత

సర్వజన ఆసుపత్రిలో మెదడు, నరాల పనితీరు, గుండె, ఎముకలు, కండరాల కదలిక, కండరాలకు రక్త సరఫరా తెలుసుకునేందుకు చేసే పలు రకాల పరీక్షలు అందుబాటులో లేవు. ఎలక్ట్రోలైట్స్ సోడియం, క్యాల్షియం, కొలెస్ట్రాల్ పరీక్షలు, అప్పుడప్పుడు థైరాయిడ్, క్రియాటినిన్, విరిగిన ఎముకలు, కండరాలకు సంబంధించి ఫ్లూయిడ్ (సీఎస్ఎఫ్) టెస్టుల కోసం చాలా వరకు ప్రైవేటు ల్యాబులకు వెళ్లాల్సిందే. ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న పరీక్షలు చేయించుకున్నా, అందుకు సంబంధించిన రిపోర్టుల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిందే. ఇక బయాప్సీ రిపోర్టు కావాలంటే 20 నుంచి 30 రోజులు పడుతుంది. అదే ప్రైవేటు ల్యాబుల వారైతే నిమిషాల్లోనే రిపోర్టు ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో సత్వర వైద్యం అవసరమైనపుడు రోగుల బంధువులు డబ్బులు చెల్లించి మరీ ఉచిత వైద్యాన్ని పొందుతున్నారు.

కమీషన్ల కోసం..

ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ప్రైవేటు ల్యాబులవారితో కుమ్మక్కవుతున్నారు. ఆసుపత్రిలో పరీక్షలు అందుబాటులో లేవని, రిపోర్టులు ఆలస్యంగా వస్తాయని, వైద్యం పొందడంలో ఆలస్యమైతే రోగి ప్రాణాలకు ప్రమాదమని భయపెడుతూ, ప్రైవేటు ల్యాబ్‌ల ఫోన్ నెంబర్లు ఇస్తుంటారు. తమకైతే తక్కువ ఫీజు తీసుకుంటారని చెప్పి ప్రైవేటువారిని పిలిపించి మరీ కమీషన్లు పొందుతుంటారు. దీంతో రోగుల జేబులకు చిల్లు పడుతోంది.

త్వరలోనే సమస్య తీరుతుంది

ఎటువంటి వైద్య పరీక్ష అయినా ఆసుపత్రిలోనే నిర్వహించాలి. అనివార్య పరిస్థితుల్లో మాత్రమే బయటకు సిఫార్సు చేయాల్సి వస్తుంది. ఆసుపత్రిలో అవకాశం ఉన్నా సిబ్బంది ప్రైవేటుకు సూచించినట్లు తెలిస్తే మాత్రం చర్యలు తీసుకుంటాం. ఈ నెలలో ఆసుపత్రి హెచ్‌డీఎస్ మీటింగ్ నిర్వహిస్తున్నాం. ఈ సమస్యపై హెచ్ఓడీలతో చర్చించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.



- డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓ, సర్వజన ఆసుపత్రి, కడప

12న షర్మిల జిల్లా పర్యటన

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, జూన్ 9,(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఈ నెల 12వ తేదీ జిల్లా పర్యటనకు రానున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గుజరాత్‌లో ఏఐసీసీ ఆమోదించిన తీర్మానాన్ని ప్రజలకు వివరించడంతో పాటు జిల్లా సమస్యలు, ప్రజాభిప్రాయం తెలుసుకోవడంతో పాటు పార్టీ పూర్వ వైభవానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తారన్నారు. ఏ పార్టీలో నైనా రెండు గ్రూపులు ఉంటాయన్నారు. ఒకటి పనిచేసే గ్రూపు అయితే రెండవది పెత్తనం కోసం పాకులాడే గ్రూపు అన్నారు. గ్రూపిజాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు శివమోహన్ రెడ్డి, ఇర్ఫాన్ బాషా, ధ్రువకుమార్ రెడ్డి, అశోక్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, సిరాజుద్దీన్, గౌస్‌పీర్, సంజయ్‌కాంత తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్లకు నిధులు విడుదల



కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ పింఛన్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి తెలిపారు. 12వ తేదీ గురువారం సంబంధిత సచివాలయాల్లో ఎంపీడీవో, మున్సిపల్ కమిషనరు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో 2,775 మందికి సంబంధించి రూ.1.11 కోట్లు నిధులు విడుదలైనట్లు పీడీ వివరించారు. బద్వేలు నియోజకవర్గంలో 405 మందికి రూ.16.20 లక్షలు, జమ్మలమడుగులో 503 మందికి రూ.20.12, కడపలో 339 మందికి రూ.13.56, కమలాపురంలో 364 మందికి రూ.14.56, మైదుకూరులో 409 మందికి రూ.16.36, ప్రొద్దుటూరులో 330 మందికి రూ.13.20, పులివెందుల నియోజకవర్గంలో 425 మందికి రూ.17లక్షలు మేర నిధులు విడుదలయ్యాయి.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

- సాక్షి కార్యాలయం ఎదుట టీడీపీ ధర్నా



సాక్షి కార్యాలయం ఎదుట తెలుగుమహిళ, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సాక్షి జర్నలిస్ట్ కొమ్మినేని, విశ్లేషకుడు కృష్ణంరాజు వ్యాఖ్యలపై పత్రిక యాజమాన్యం బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని టీడీపీ నేతలు హెచ్చరించారు. సోమవారం కడప నగర శివారులోని సాక్షి ప్రధాన కార్యాలయం ఎదుట తెలుగుమహిళ, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బైఠాయించి పత్రిక యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమరావతిని కించపరుస్తూ వేశ్యలుగా చిత్రీకరించడం దారుణమన్నారు. ఇదే అమరావతిలో సాక్షి అధినేత వైఎస్ జగన్ కుటుంబం కూడా ఉందన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని, కృష్ణంరాజులను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పత్రికా యాజమాన్యం క్షమాపణ చెప్పాలని కోరారు. అనంతరం పోలీసులకు వినతిపత్రం సమర్పించారు.

అన్నమయ్య ప్రాజెక్టు అధ్యయనానికి సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు

కలికిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద విధ్వంసానికి కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రాథమికంగా ఈ ప్రాజెక్టు పునరుద్ధరణపై అధ్యయనం చేయడానికి ఆరుగురు ఉన్నత స్థాయి నిపుణులతో కూడిన సాంకేతిక బృందాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉన్నతస్థాయి నిపుణుల కమిటీలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిజైన్ ఎక్స్‌పర్ట్ చీఫ్ ఇంజినీరు రమేష్‌కుమార్, హైదరాబాదుకు చెందిన హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్, రిటైర్డు చీఫ్ ఇంజినీరు కె.సత్యనారాయణ, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా రిటైర్డు డైరెక్టర్ జనరల్ (జియాలజిస్టు) ఎం.రాజు, జల వనరుల శాఖ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీరు (డిజైన్ అప్రూవింగ్ అథారిటీ), విజయవాడ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ హైడ్రాలజీ చీఫ్ ఇంజనీర్లు కమిటీ సభ్యులుగా, కడప జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) కన్వీనరుగా నియమిస్తూ ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో 2022లో రివర్ గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా నదులతో పాటు ఇతర ప్రాజెక్టులపై సలహాలివ్వడం కోసం నియమించిన కమిటీకి నిర్దేశించిన నిబంధనలన్నీ ప్రస్తుత సాంకేతిక నిపుణుల కమిటీకి వర్తించనున్నట్లు పేర్కొంటూ జల వనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం కమిటీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి



ఫిర్యాదుదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 170 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం తదితరులు పాల్గొన్నారు.

అలక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



అర్జీలు స్వీకరించి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, అలక్ష్యం చేసే అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి బాధితులు హాజరై జేసీకి, అధికారులకు అర్జీలు సమర్పించారు. వారి అర్జీలు పరిశీలించిన మీదట తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు.

ఈ సందర్భంగా సీకే దిన్నె మండలం జే.కొత్తపల్లికి చెందిన రామమూర్తి ఫిర్యాదు చేస్తూ తన ఆధీనంలో ఉన్న భూమికి ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్‌బుక్ ఇవ్వాలని అభ్యర్థించారు. ఊటుకూరు రైల్వేగేటు కోసం జరిగిన భూ సేకరణలో తన జీవనాధారమైన కొంత స్థలం ప్రభుత్వం తీసుకుందని నష్టపరిహారం ఇప్పించాలని కడపకు చెందిన గయాజ్ బాష అర్జీ సమర్పించారు. అలాగే దువ్వూరుకు చెందిన పి.భాసింబీ ఫిర్యాదు చేస్తూ తన ఇంటికి కరెంట్, నీటి వసతి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీ వెంకటపతి, జిల్లా అధికారులు సరస్వతి, ఆదిశేషారెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీలక్ష్మీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్ల పంట నష్టం



హిమకుంట్లలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి

సింహాద్రిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలంలో ఆదివారం వీచిన ఈదురుగాలులతో దెబ్బతిన్న అరటి తోటలను సోమవారం మండల ఉద్యానశాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి, ఏఓ శివమోహన్‌రెడ్డి పరిశీలించారు. సింహాద్రిపురంలో 16 మంది రైతులకు సంబంధించి 18 హెక్టార్లలో, గురిజాలలో 12 మంది రైతులకు సంబంధించి 12 హెక్టార్లలో, హిమకుంట్లలో 10 మంది రైతులకు సంబంధించి 14 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిని రూ.1.50 కోట్ల నష్టం జరిగినట్లు వారు తెలిపారు. దీనికి సంబంధించి నివేదికలను జిల్లా అధికారులకు పంపిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేసి తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

పేదరికం లేని సమాజం కోసం పీ-4

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఇతర శాఖల అధికారులు

జమ్మలమడుగు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం కోసం పీ-4 సర్వే చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి హాజరయ్యారు. ఆర్డీవో సాయిశ్రీ, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 2047కు భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తవుతుందని, అప్పటికి ప్రతి ఒక్కరు 15 శాతం గ్రోత్ రేటు అభివృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమన్నారు. అప్పుడే పారిశ్రామికంగా, సేవా రంగంలో అభివృద్ధి సాధించగలరని అన్నారు. వికసిత భారత్-2029 నాటికి నియోజకవర్గ స్థాయిలో పేదరిక నిర్మూలన, సామాజిక ప్రగతి, వీధి లైట్లు, డ్రైనేజీ, రోడ్డు సదుపాయం తదితరాలన్నీ పూర్తి కావాలని అన్నారు. కాగా.. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ, నియోజకవర్గ కమిటీ ఏర్పాటులో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.

ఈతకు వెళ్లి...
సంపులో మునిగి చిన్నారులు మృతి
7
పుంజుకుంటున్న టమోటా ధరలు

స్టీల్‌ప్లాంట్ నిర్మాణం త్వరగా చేపట్టాలి

- ఏఐసీసీ మెంబర్ సుంకర పద్మశ్రీ



స్టీల్‌ప్లాంట్ నిర్మించాలంటూ కాంగ్రెస్ శ్రేణులతో కలసి కొంగుచాచి నిరసన తెలుపుతున్న ఏఐసీసీ మెంబర్ సుంకర పద్మశ్రీ తదితరులు

మైలవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని అందులో భాగంగా కడప స్టీల్‌ప్లాంట్ త్వరగా చేపట్టాలని కాంగ్రెస్ నాయకురాలు, ఏఐసీసీ మెంబర్ సుంకర పద్మశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎం.కంబాలదిన్నె సమీపంలో గతంలో సీఎం చంద్రబాబునాయుడు స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని కాంగ్రెస్ శ్రేణులతో కలసి ఆమె పరిశీలించారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణం త్వరగా చేపట్టాలంటూ ఆమె కొంగుచాపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ పదిరోజుల్లో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తామని మహానాడులో చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడు ఒకరి తర్వాత మరొకరు స్టీల్‌ప్లాంట్ కోసం శంకుస్థాపనలు చేసుకుంటూ పోతున్నారే తప్ప పనులు ముందుకు సాగడంలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా అమరావతి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, వైసీపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, శ్రీరాములు, కర్నూలు జిల్లా మహిళా నాయకురాలు సుజాత, జమ్మలమడుగు కాంగ్రెస్ నేత బ్రహ్మానందరెడ్డి, పాముల బ్రహ్మానందరెడ్డి, నజీర్, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు అవార్డులు ప్రోత్సాహకాలు

- 266 మందికి షైనింగ్ స్టార్ అవార్డులు
- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



విద్యార్థులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం కడప శివారులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో 2024-25లో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్-2025 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేల నగదు, సత్కారం చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనం, కృషి, పట్టుదల ఆశయాలకు ఈరోజు రెక్కలు వచ్చిన రోజని అభివర్ణించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం కష్టం కాదని, లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రణాళిక ప్రకారం దృఢ సంకల్పంతో అడుగులేయాలన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అందుకోవడానికి కృషిచేయాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మనం ఎదుగుతూనే మన సమాజంలో తోటివారి ఎదుగుదలను కూడా ఆకాంక్షించే [illegible] అలవరచుకోవాలన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను, కలలను సఫలీకృతం చేస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నా అన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న షైనింగ్ స్టార్ ప్రోత్సాహక కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తుందన్నారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి, అలాగే విద్యాశాఖ మంత్రి షైనింగ్ స్టార్ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇంటర్మీడియట్ ఆర్జేడీ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రుల గౌరవాన్ని మరింత పెంచేలా విలువలతో కూడిన విద్యనభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత పదవులు, అధికారాలను అందుకోవాలని సూచించారు. ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య, డీఈఓ షంషుద్దీన్, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్ ప్రసంగించారు. అనంతరం 266 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున మంజూరైన రూ.53,20,000 మెగా చెక్కును, ప్రశంసా పత్రాలను, మెడల్స్‌ను కలెక్టర్, ముఖ్యఅతిథుల చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

అమ్మో.. జాక్‌పాట్!

ప్రకృతి వైపరీత్యాలు, పెట్టుబడి కోసం చేసిన అప్పులకు పెరిగిపోతున్న వడ్డీలు, మార్కెట్‌లో ఒడిదుడుకులతో ఏటేటా తీవ్రంగా నష్టపోతున్న రైతులను జాక్‌పాట్ భూతం మరింతగా కుంగదీస్తోంది. ఎండా, వానా, పగలు, రేయనక కష్టించి పండించి మార్కెట్‌కు తరలించిన టమోటాల్లో 10 శాతం పైగా జాక్‌పాట్ భూతం అప్పనంగా మింగేస్తోంది. దీంతో మంచి ధర పలికినపుడు సైతం సంతోషమన్నది రైతు గడపదాకా చేరకుండా పోతోంది.



- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- మారని వ్యాపారుల తీరు
- కొత్త పాలకవర్గం సమస్య పరిష్కరించేనా?

గుర్రంకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టమోటా మార్కెట్‌లో జాక్‌పాట్ భూతం రైతులను పట్టి పీడిస్తోంది. మార్కెట్‌కు టమోటాలు తెచ్చిన ప్రతిసారీ రైతు వేలాది రూపాయల మేరకు నష్టాలను మూటగట్టుకుంటున్నాడు. మంచి ధర పలికే సమయంలో ప్రతి రైతూ తెలిసి తెలిసీ లక్షలాది రూపాయలను జాక్‌పాట్ రూపంలో కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విధానం రద్దు చేయాలంటూ దశాబ్దకాలంగా రైతులు మార్కెట్ యార్డు వద్ద ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం, అధిక కమీషన్‌లను రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నా.. ఆచరణలో అవి నీటిమూటలుగానే మిగిలాయి. దీంతో వ్యాపారులు తాము చేసిందే చట్టమంటూ దోపిడీ కొనసాగిస్తున్నారు.

జాక్‌పాట్ అంటే...

ఓ రైతు 25 కిలోల బరువు గల వంద క్రేట్‌ల టమోటాలను మార్కెట్‌కు తీసుకొస్తే.. అందులో పది క్రేట్లకు ఒక క్రేట్‌ను జాక్‌పాట్‌గా తీసుకుంటారు. దీంతో వంద క్రేట్లకు పది క్రేట్లు జాక్‌పాట్ కింద రైతు నష్టపోతాడు. క్రేట్లకు నిండుగా టమోటాలు లేవంటూ మరొకొన్ని క్రేట్ల టమోటాలను మిగిలిన క్రేట్లపై పోస్తారు. ఇలా రైతు తెచ్చిన వంద క్రేట్లు కాస్తా వ్యాపారులు వేలం నిర్వహించే లోపు 80 క్రేట్లకు వచ్చేస్తాయి.

కొత్తపాలకవర్గం వైపు...రైతుల చూపు

వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి వారం రోజుల క్రితం కొత్త పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసింది. దీంతో ఏడాదిగా కాలంగా ఖాళీగా ఉన్న చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు భర్తీ అయ్యాయి. మార్కెట్ కమిటీకి వాల్మీకిపురం కంటే గుర్రంకొండ మార్కెట్ యార్డు ద్వారానే ఏడాదికి కోటిపైగా ఆదాయముంది. ఇంతటి ఆదాయమున్న మార్కెట్ యార్డులో రైతులు జాక్‌పాట్ విధానంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో కొత్త పాలకవర్గమైనా జాక్‌పాట్ విధానంపై కఠినంగా వ్యవహరించి రైతులకు మేలు చేస్తారని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

జాక్‌పాట్‌ను రద్దు చేయాలి



గుర్రంకొండ మార్కెట్ యార్డులో రైతుల నడ్డి విరుస్తున్న జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలి. ఈ విధానం కారణంగా టమోటాకు ధరలు లేని సమయంలో పెట్టుబడులు కూడా రావడం లేదు. వ్యాపారులు అధిక కమీషన్ వసూలు చేస్తున్నారు. జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని పలు మార్లు మార్కెట్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతస్థాయి అధికారులు కల్పించుకుని రైతుల పాలిట భూతంలా మారిన జాక్‌పాట్‌ను తరిమివేయాలి.

- పి.అమరనాథ్, రైతు గుర్రంకొండ

వ్యాపారులతో మాట్లాడి పరిష్కరిస్తాం



గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంపై రైతుల నుంచి అధికంగా ఫిర్యాదులు అందాయి. మార్కెట్ యార్డులో వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహించి జాక్‌పాట్ విధానంపై చర్చిస్తాం. రైతులకు నష్టం కలిగించే జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయించి రైతులను ఆదుకుం టాం. రైతుల సమస్యలను ఒకదాని తరువాత ఒకటిగా పరిష్కరిస్తాం.

-షేక్ నౌషాద్‌అలీ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్

అంతర్ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ విజేత చెన్నై

పీలేరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు విజేతగా చెన్నై ఎస్‌ఆర్‌ఎం టీం నిలిచింది. పీలేరు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ముగిశాయి. ఇందులో మూడు రాష్ట్రాలకు చెందిన 18 టీంలు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ చెన్నై టీం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానం కర్ణాటక టీం, తృతీయ స్థానం చెన్నైకి చెందిన ఎస్టీ జోసెఫ్ టీం, నాలుగో స్థానంలో గుంటూరుకు చెందిన సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, భాస్కర్ రెడ్డి, ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజీ, పలువురు పీడీలు, పీఈటీలు, పీలేరు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.



అంతర్‌రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ కప్పుతో చెన్నై ఎస్ఆర్ఎం టీం

ఎట్టకేలకు ఫలించిన ‘ఢిల్లీ రైలు’ కల!

- 11 నుంచి రాజంపేటలో సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్

రాజంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీ నగరానికి నేరుగా వెళ్లే రైలుకు రాజంపేటలో స్టాపింగ్ కోసం రెండు దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తిరుపతి నుంచి ఢిల్లీకి వెళ్లే రైలు 12707 సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 11 నుంచి రాజంపేటలో స్టాపింగ్ ఇస్తూ దక్షిణమధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఒక ప్రకటన జారీ చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కోసం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ద్వారా సాయిలోకేశ్ కేంద్ర మంత్రిని కలిసి విన్నవించారు. ఈ మేరకు రైల్ నంబరు 12707 తిరుపతి-హెచ్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్, 12708 హజరత్ నిజాముద్దీన్ - తిరుపతి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో ఆగనున్నాయి. ప్రతి సోమ,బుధ , శుక్ర వారాల్లో 12707 ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో ఉదయం 6.43 గంటలకు ఆగి 6.45 కు బయలుదేరనుంది. ఆది,బుధ, శుక్రవారాల్లో 12708 ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో 18.38 గంటలకు ఆగి 18.40 గంటలకు బయలుదేరనుంది. ఈనెల 11న రాజంపేటలో ఆగుతున్న సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 12708 హజరత్ నిజాముద్దీన్ తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఈనెల 13 నుంచి రాజంపేటలో ఆగనుంది. దీనిని రైల్వే అదికారులు అధికారికంగా ప్రారంభించనున్నారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట ప్రధాన రైల్వే స్టేషన్, పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న రాజంపేటలో ఈ రైలు ఆగడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. రాజంపేట రైల్వేస్టేషన్ మార్గం ద్వారా ప్రతిరోజు 33 రైళ్లు ప్రయాణిస్తూ ఉంటాయి. అందులో కొన్ని రైళ్లు తప్ప మిగిలిన ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఆగవు. కరోనా తరువాత గతంలో ఆగే అనేక రైళ్లను కూడా రద్దు చేశారు. ఈ విషయాన్ని గమనించి రాజంపేట రైల్వేస్టేషన్ ప్రాముఖ్యతను వివరిస్తూ కేంద్ర మంత్రులతో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పలుసార్లు వినతిపత్రాలు సమర్పించగా ఇటీవల పలు రైళ్లు రాజంపేటలో ఆగుతున్నాయి. ఈ నెల 11న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రాజంపేటలో స్టాపింగ్ సందర్భంగా రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



కూటమి ప్రభుత్వం ఇచ్చే కానుక : సాయి లోకేశ్

దేశరాజధాని ఢిల్లీకి వెళ్లాలన్నా, అక్కడి నుంచి రావాలన్నా ఈ మార్గంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి రావడానికి ఈ రైలు ఎంతో ప్రయోజకనరమైనది. నా విన్నపాన్ని మన్నించి కేంద్ర బీజేపీ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం పాలనలో రాజంపేటలో ఈ రైలు స్టాపింగ్‌కు ఉత్తర్వులు జారీ చేయడం చెప్పలేని ఆనందంగా ఉంది. 11వ తేదీ నుంచి రాజంపేటలో సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఆగడానికి అధికారికంగా రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉంది.

‘తోతాపురి మామిడి’కి మద్దతు ధర

- విధి విధానాలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

రైల్వేకోడూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి పండ్లకు మద్దతు ధర ప్రకటించింది. ప్రాసెసింగ్ కంపెనీలు కిలోకు రూ.8, రాష్ట్ర ప్రభుత్వం రూ.4 చొప్పున రైతులకు అందజేయనుంది. ఇందుకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పలు సూచనలు చేసింది. వివరాలిలా..

మామిడి రైతులు తమ 1బి, ఆధార్ కార్డు, ఆధార్ లింక్డ్ బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను ఫ్యాక్టరీ, ఎఫ్‌పీఓ లేదా మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలి. పక్వానికి వచ్చిన కాయలను దశలవారీగా కోయాలి. ఒకేసారి కోయడం వల్ల ఫ్యాక్టరీల వద్ద రద్దీ ఏర్పడి, యాజమాన్యానికి ఇబ్బంది కలుగుతుంది. ఫ్యాక్టరీకి నేరుగా కాయలు తీసుకెళ్లే రైతులు పైన పేర్కొన డాక్యుమెంట్లను తప్పనిసరిగా తీసుకెళ్లాలి. అక్కడ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు రైతుల వివరాలను నమోదు చేస్తారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా రైతు, పంట వివరాలను నమోదు చేస్తుంది. ప్రభుత్వ మద్దతు ధర నేరుగా రైతు ఖాతాలో జమ అవుతుంది. ఫ్యాక్టరీ చెల్లించే మొత్తం కూడా రైతు ఖాతాలోనే జమ అవుతుంది. మార్కెట్ యార్డు లేదా ఎఫ్‌పీఓకు కాయలు తీసుకెళ్లే రైతులు ఆయా డాక్యుమెంట్లను తీసుకెళ్లి, అక్కడ విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగి వద్ద నమోదు చేయించుకుని, మార్కెట్ యార్డు ఎఫ్‌పీఓకు కాయలను అమ్మాలి. ఉదాహరణకు, ఇద్దరు రైతులు 5 టన్నుల చొప్పున కాయలు అమ్మితే, మార్కెట్ యార్డు వారు నాణ్యత తనిఖీ చేసి, రైతులకు నేరుగా లేదా డిజిటల్ విధానంలో నగదు చెల్లిస్తారు. మార్కెట్ యార్డు వారు ట్రాకులో లోడ్ చేసిన తర్వాత ఏ రైతుకు సంబంధించిన సరుకు ఏ ఫ్యాక్టరీకి వెళ్తుందనే విషయాన్ని ప్రభుత్వ ఉద్యోగి నమోదు చేస్తారు. ఈ వివరాలను ఫ్యాక్టరీ వద్ద ఉన్న ప్రభుత్వ ఉద్యోగికి అందజేస్తారు. ప్రభుత్వం రూ.4 మద్దతు ధరను రైతు ఖాతాలో నేరుగా జమ చేస్తుంది. రైతులు ఈ నెల 9వ తేదీ నుంచి తమకు అనుకూలమైన ఫ్యాక్టరీ లేదా మార్కెట్ యార్డు యాజమాన్యంతో సంప్రదించి కాయలను కోయడం ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవచ్చుని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు ఒక ప్రకటనను విడుదల చేశారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : ఎస్పీ

రాయచోటిటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్దిత గడువులోపు విచారణ చేసి సత్వరం పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి రాలేని వారు తమకు సమీపంలోని పోలీసు స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో అర్జీలు సర్పించవచ్చునన్నారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు తెలుసుకుని సత్వరం న్యాయం చేస్తామన్నారు.



బాధితుల వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ఫిర్యాదుదారుల వద్దకు ఎస్పీ..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తమ సమస్యలు వినిపించేందుకుగుర్రంకొండ మండలం సూరప్పగారిపల్లె నుంచి ఇడగొట్టి పుష్పలత జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఆమె నడవలేని స్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆమె వద్దకే వెళ్లి సమస్యను విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ చట్ట పరిధిలో ఆమె సమస్యను పరిష్కరించాలని గుర్రంకొండ ఎస్ఐని ఆదేశించారు. చిన్నమండెం మండలం పఠాన్ అమీరుల్లాఖాన్ అనే వృద్ధుడి వద్దకు వెళ్లి సమస్యను విన్నారు. ఆయన సమస్యను పరిష్కరించాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్‌ను ఆదేశించారు.

ప్రజల సమస్యలు తక్షణం పరిష్కరించాలి: డీఆర్‌వో

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డీఆర్‌వో మధుసూదన్‌రావు సూచించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా అందిన ప్రజల అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు.ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తోందన్నారు. ప్రతి సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ఫిర్యాదులను వంద శాతం పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి సమస్యను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. కొంత మంది అర్జీదారులు పదే పదే వస్తున్నారని అలా కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలదేన న్నారు. అనంతరం అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

అన్నమయ్య జిల్లాలో ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

రాయచోటిటౌన్, జూన్9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవి, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం 6 పరీక్షా కేంద్రాల్లో 1092 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 951 మంది హాజరుకాగా 141 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలియజేశారు.




భాస్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

జలవనరుల శాఖ ఇంజనీర్లపై విచారణ

కలికిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం జలవనరుల శాఖ కడప సర్కిల్ పరిధిలో పనిచేసిన ఐదుగురు ఇంజనీర్లపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇందుకు సంబంధించి విచారణాధికారిని నియమిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లా కలసపాడు మండలం బ్రాహ్మణపల్లెలో రాచెరువు పటిష్టీకరణతోపాటు, నీటి పారుదల కాలువల అభివృద్ధి పనులకు ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరు చేసింది. ఈ పనులను పూర్తి చేసే క్రమంలో సంబంధిత ఇంజనీర్లు తీవ్రమైన అక్రమాలకు పాల్పడ్డట్లు విజిలెన్స్ గుర్తించింది. ఈ అవకతవకలకు సంబంధించిన వివరాలను సాక్ష్యాధారాలతో 2021 అక్టోబరు 18న ప్రభుత్వానికి అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. ఇది గడిచిన అనంతరం ప్రభుత్వం తాపీగా సరిగ్గా ఏడాది తరువాత 2022 అక్టోబరు 18 బాధ్యులైన ఐదుగురు ఇంజనీర్లకు నామమాత్రంగా నోటీసులు అందజేసి పది రోజుల గడువుతో సంజాయిషీలు కోరింది. అంతటితో ఇది మూలన పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఐదుగురు ఇంజనీర్లు సమర్పించిన సంజాయిషీలను పరిశీలించి తదుపరి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అప్పట్లో ఈ పనులను పర్యవేక్షించిన జలవనరుల శాఖ ఈఈ ఎం.కొండారెడ్డి(ప్రస్తుతం రిటైరయ్యారు), మరో ఈఈ ఇ.మల్లికార్జున, డీఈఈలు ఎం.వి. రమణారెడ్డి, టి.మల్లికార్జున, ఏఈఈ ఎస్.పణీంద్ర సింగ్‌లు విచారణను ఎదుర్కోవలసి వుంది. విచారణాధికారిగా కడపలోని రాయలసీమ రీజియన్ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీరు ఎం.కిరణ్ కుమార్‌ను విచారణాధికారిగా నియమించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

కిటకిటలాడిన మల్లయ్య కొండ



నృత్యాలు చేస్తున్న గొరవయ్యలు

తంబళ్లపల్లె, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగుస్తుండడంతో స్థానిక మల్లయ్యకొండలో ఉన్న భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని సోమవారం పెద్దఎత్తున భకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది.అర్చకుడు ఈశ్వరప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల పేరిట అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వ హించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మల్లయ్యదారులు పిల్లనగ్రోవి వాయిద్యాలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బంది కలుగకుండా కొండపైన అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఆటోనగర్ ప్రారంభానికి చర్యలు

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని ఆటో కార్మికులకు కలగా మిగిలిపోయిన ఆటోనగర్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలోని 33 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఆటోనగర్ స్థలాన్ని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తితో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆటోనగర్‌కు కేటాయించిన స్థలంలో కొంత స్థలం ముగ్గురు రైతులు కోర్టులో కేసు వేశారని, ఈ ముగ్గురు రైతులకు నచ్చజెప్పి తగిన నష్టపరిహారం ఇచ్చేలా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయమై ఏపీఐఐసీ అధికారులతో కూడా చర్చించామన్నారు. త్వరలో ఆటోనగర్ ప్రారంభానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సర్వేయర్ రెడ్డిశేఖర్‌బాబు, టీడీపీ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వలసపల్లె పంచాయతీలోని ఆటోనగర్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

విత్తనోత్పత్తితో అధిక ఆదాయం

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణిమురుగన్

పుల్లంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విత్తనోత్పత్తితో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని భారత నూనెగింజల పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణిమురుగన్ తెలిపారు. అన్నమయ్య జిల్లా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని అనంతసముద్రం, అప్పయ్యరాజుపేట గ్రామాల్లో కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతుల ప్రత్యక్ష సంభాషణలను వారికి ఖరీఫ్ పంట కాలం ముందు అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. 700 జిల్లాల్లో 2 వేల మంది కంటే ఎక్కువ భాగస్వామ్యంతో నూతన సాంకేతికత, ప్రభుత్వ పథకాలపై సమాచారం అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. నువ్వులు, పొద్దుతిరుగుడు విత్తనాలు మేలైన రకాల యాజమాన్య పద్ధతులు, సాగులో సాంకేతికత, డ్రోన్లపై వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ ప్రధాన పంటల్లో జీవన ఎరువులు, జీవ నియంత్రకాల వాడకంపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస మాట్లాడుతూ మామిడి, అరటి, బొప్పాయ, చీనీ, నిమ్మ తోటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పుల్లంపేట వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు సంఘాలుగా ఏర్పడి లాభసాటి వ్యవసాయం వైపు సాగాలని తెలియజేస్తూ ప్రభుత్వ పథకాలను వివరించారు. నేల సమతుల్యతను కాపాడే విధంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సుచిత్ర మాట్లాడుతూ అంతర పంటల ప్రాముఖ్యత, పంట మార్పిడి, అధిక దిగుబడిని ఇచ్చే నూతన వంగడాల ప్రాముఖ్యతపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం సుబ్రమణ్యం, గ్రామీణ వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతు ఉత్పత్తిదారులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మణి మురుగన్

ఇద్దరు దొంగల అరెస్ట్

- 75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు స్వాధీనం
- పట్టుబడినవారు 9 కేసుల్లో నిందితులు

పీలేరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద రూ. 8 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ హెగ్డే తెలిపారు. పీలేరు పట్టణ శివారు ప్రాంతంలోని కోళ్లఫాం వద్ద సోమ వారం మదనపల్లెలోని చీకటిగుట్ట ప్రాంతానికి చెందిన కావడి సోమ శేఖర్(29), పీలేరులోని ఎస్టీ కాలనీకి చెందిన జరుపుల మణికంఠ (27)ను అదుపులోకి తీసుకుని 75 గ్రాముల బంగారు, 226 గ్రాముల వెండి నగలు, హీరోహోండా స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెపారు. నిందితులపై పీలేరులో 3 కేసులు, కలికిరిలో రెండు, మదనపల్లెలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీస్ విచారణలో వెలుగుచూసింది. కావలి సోమశేఖర్‌పై 15 కేసులు నమోదైఉండగా, రెండవ ముద్దాయి మణికంఠ పీలేరు మండ లం యర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఉంటూ భార్య హత్య కేసులో జైలుకు వెళ్లాడు. జైలులో ఉన్నపుడు ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక ఇరువురూ ద్విచక్ర వాహనంపై తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడేవారని ఏఎస్పీ తెలిపారు.



పట్టుబడిన దొంగలు, స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఏఎస్పీ మనోజ్ హెగ్డే

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

విడిగా ఉండే ఇళ్ల వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ సూచించారు. ఇంటి వద్దకు ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినపుడు కిటికీ ద్వారా పరిశీలించి తలుపులు తీయాలని సూచించారు. ద్విచక్రవాహనాలపై సంచరించే కొత్త వ్యక్తులపై నిఘా ఉంచి అనుమానాస్పదంగా అనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లకుతాళం వేసుకొని ఊర్లకు వెళ్లేటపుడు పోలీసులు, ఇరుగు పొరుగు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఖరీదైన బంగారు, నగదు తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు.

ఎస్పీ అభినందన

ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేయడంతో పాటు, చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతో కీలకంగా వ్యవహరించిన పీలేరు సీఐ యుగంధర్, ఎస్ఐ లోకేశ్, సిబ్బంది శ్రీనివాసులు, రాధాకృష్ణ, ఉపేంద్ర, తిరుపాల్ నాయక్, జగదీశ్‌ను ఎస్పీ అభినందించారు. విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

ముద్దనూరులో రైళ్ల నిలుపుదల ఎప్పుడో..!



ముద్దనూరు జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు రైల్వే స్టేషన్‌లో విజయ వాడకు వెళ్లే రైళ్లను తప్పనిసరిగా నిలపాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ముద్దనూరు రైల్వేస్టేషన్ ఉన్నప్పటికి చాలా వరకు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం దీనిపై ఎందుకు స్పందించడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

ముద్దనూరు ఒకప్పుడు సమితి కేంద్రంగా ఉండేది. కొండాపురం మండలం కూడా ముద్దనూరు సమితీలో ఉండేది. అంటే ముద్దనూరు అంత ప్రాధాన్యత కలిగి ఉండేది. మండల కేంద్రంలో వ్యవసాయశాఖ ఏడీ, ఉద్యానశాఖ, పశువైద్యశాల ఏడీ, అటవీశాఖ రేంజి, ఐసీడీఎస్ కార్యాలయాలు ఉన్నాయి. అంతేకాకుండా జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల నుంచి ప్రజలు చెన్నై, హైదరాబాదు, ముంబైకు రైలు ప్రయాణం చేయాలన్న ముద్దనూరు రైల్వే స్టేషన్‌కు వస్తారు. నిమ్మకాయల ఎగుమతి కూడా ఎక్కువగా ఇక్కడి నుంచే జరుగుతుంటుంది. కరోనా సమయంలో చాలా రైళ్లను నిలిపివేశారు. కానీ రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి కేంద్రంగా ఉంది. ప్రస్తుతపరిస్థితుల్లో ముద్దనూరు, పులివెందుల ప్రజలు అమరావతికి వెళ్లాలన్నా, విజయవాడ, గుంటూరులో చదువుకునే విద్యార్థులు ముద్దనూరులో రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నుంచి విశాఖపట్నంకు ఎర్రగుంట్ల మీదుగా రైలు నడుస్తుంది. ప్రస్తుతం మరో రైలు గుంతకల్లు నుంచి కడప మీదుగా విజయవాడకు పునరుద్దరించారు. ఈ రెండింటికి ముద్దనూరు స్టేషన్‌లో స్టాపింగ్ లేదు. చాలా చోట్ల ప్రజాప్రతినిధులు, సంఘాలు పోరాడి స్టేషన్‌లలో స్టాపింగ్ చేయిచుకుంటున్నా ఎంతోప్రాధాన్యత ఉన్న ముద్దనూరులో అమరావతికి వెళ్లే రైళ్లకు స్టాపింగ్ లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రజల సౌకర్యార్థం రైళ్లను ముద్దనూరు స్టేషన్‌లో నిలపేటట్లు ప్రజాప్రతినిధులు, గుంతకల్ రైల్వే డివిజన్ అధికా రులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైళ్లు నిలపాలి

ముద్దనూరు స్టేషన్‌లో విజయవాడ వెళ్లే రైళ్లకు స్టాపింగ్ ఉంటే సౌకర్యంగా ఉంటుంది. బస్సుల్లో వెళ్లాలంటే చార్జీ ఎక్కువగా ఉంటుంది. సమయానికి రిజర్వేషన్ సీట్లు దొరకవు. దీంతో సెలవుల్లో ఇంటికి వచ్చి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ ఉంటే రిజర్వేషన్ సౌకర్యం లేకున్నా, జనరల్‌లో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది.

-ఉమామహేశ్వర్, విద్యార్థి, ముద్దనూరు

ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళా క్రికెట్

● ఐదు జిల్లాల క్రీడాకారిణిల హాజరు



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్‌డీసీఏ ప్రతినిధులు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏ క్రీడామైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభ మయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ.గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపు రం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంత పురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసుల రెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.

రేషన్ స్మగ్లర్లపై చర్యలు తీసుకోండి

పౌరసరఫరాల శాఖ మంత్రికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి లేఖ

పులివెందుల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో రేషన్ బియ్యం స్మగ్లర్లు బరితెగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి లేఖ రాశారు. ఈ మేరకు ఆయన సోమవారం లేఖను మీడియాకు విడుదల చేశారు. రేషన్ స్మగ్లర్లకు లెక్కలేకుండా పోయిందన్నారు. గత కొన్ని రోజుల క్రితం వరకు విజిలెన్స్ అధికారులు కట్టడి చేసినప్పటికి మళ్లీ వారం రోజులుగా విచ్చలవిడిగా అక్రమ రవణాకు పాల్పడుతున్నారన్నారు. దీనికి కారణం తమరితో (మంత్రి) ఉన్న ఫొటోను వైసీపీకి చెందిన స్మగ్లర్లు కామేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌లు అందరికీ చూపిస్తూ మాకు మంత్రి అండదండలు ఉన్నాయని, మా జోలికి వస్తే అంతు చూస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఇవి నిజమైన ఫొటోలా లేక మార్ఫింగ్ ఫొటోలా అర్థం కాక అధికారులు హడలిపోతున్నారన్నారు. వారిపైన చర్యలు తీసుకోవాలని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు. వారు సర్కులేట్ చేస్తున్న ఫొటోలను లేఖతో పాటు జతచేస్తున్నామన్నారు. వీరిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

జాతీయ స్థాయి ఓపెన్ చెస్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంటులో జిల్లా చెస్ క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. వివిధ వయో విభాగాల్లో మొత్తం ఐదు బహుమతులు గెలుచుకున్నారు. అండర్-6 బాలుర విభాగంలో దీక్షిత్ 4వ స్థానం, అండర్-8 బాలికల విభాగంలో లాస్య ప్రియ 2వస్థానం, అండర్-8 బాలుర విభాగంలో ప్రణవ్ స్వరూప్ 5వ స్థానంలో నిలిచారు. అలాగే అండర్-10 బాలికల విభాగంలో ధనిత 4వ స్థానం, 50 ఏళ్లకు పైబడిన వయోవర్గంలో అనీస్ దర్బారి 1వ స్థానం పొందారు.

5వ రోజుకు.. కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ఎర్రగుంట్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఐసీయల్ కర్మాగారం వద్ద ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు చేస్తున్న ఆందోళన సోమవారానికి 5వ రోజుకు చేరింది. సోమవారం ఉదయం ప్లాంటులో పనిచేస్తున్న యాజమాన్య ఉద్యోగులు, ఇతర కాంట్రాక్టు కార్మికులు విధుల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే తాము ఆందోళన చేస్తున్న నేపథ్యంలో లోపలికి వెళ్లనివ్వమని కాంట్రాక్టు కార్మికులు అడ్డగించారు. దీంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. తమ డిమాండ్లు నెరవేరేంత వరకు ఎవ్వరిని లోపలికి పంపేందుకు తాము అంగీకరించమని కాంట్రాక్టు కార్మికులు అడ్డంగా బైఠాయించారు. పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

ఈతకు వెళ్లి... సంపులో మునిగి చిన్నారులు మృతి



సంపులో పడి మృతి చెందిన రాముడు, లక్ష్మణుడు

చక్రాయపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రీ లేని ఇద్దరు అనాథ పిల్లలు ఈత కోసం వెళ్లి నీటి సంపులో మునిగి మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఆదివారం రాత్రి చక్రాయపేట మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

చక్రాయపేట మండలం బాలతిమ్మయ్యగారి పల్లె సమీపంలోని ఓ మామిడి తోటలో ఉన్న సంపులో ఈత కోసం దిగిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృతి చెందారు. ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన రాముడు (11), లక్ష్మణుడు (9) అన్నదమ్ములు. వీరి తండ్రి చనిపోవడం.. తల్లి దూరం కావడంతో మేనమామ కొండయ్య వద్ద ఆశ్రయం పొందుతున్నారు. కొండయ్య బతుకుదెరువు కోసం బాలతిమ్మయ్యగారిపల్లెలోని భాస్కర్ అనే రైతు మామిడితోటలో కాపాల ఉంటున్నాడు. పిల్లలకు సెలవులు కావడంతో ఆదివారం మేనమామ కొండయ్య ఉంటున్న తోట వద్దకు వచ్చారు. తోటలో పిల్లలు ఆడుకుంటూ ఉండడంతో ఆయన పనిమీద బయటకు వెళ్లారు. సాయంత్రం వచ్చి చూస్తే పిల్లలు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఎక్కడ ఆచూకీ కనిపించలేదు. అప్పటికే పొద్దుపోయి రాత్రి కావడంతో చివరకు అనుమానం వచ్చి తోటలో ఉన్న సంపు వద్దకు వెళ్లి పరిశీలించాడు. అప్పటికే ఇద్దరు పిల్లలు సంపులో మునిగి మృతి చెందడం గమనించాడు. సంపు చుట్టూ ఉన్న తార్పాలిన్ పట్టకు పాచిపట్టి ఉండడతో బయటకు వచ్చే మార్గం లేక ఇద్దరు జారిపడిపోయి ఊపిరిడక మృతి చెంది ఉండవచ్చని సమాచారం. కాగా, మృతి చెందిన ఇద్దరు పిల్లలను సోమవారం తెల్లవారుజామున వారి సొంత గ్రామమైన ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు తరలించారు. అయితే ఈ సమాచారం చక్రాయపేట పోలీసులకు తెలియడంతో వారు పిల్లల మృతదేహాలను చక్రాయపేటకు తీసుకువచ్చి.. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కూలి డబ్బులు అడిగారని దాడి.. ముగ్గురికి గాయాలు

పులివెందుల,జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కూలి డబ్బులు అడిగినందుకు ముగ్గురు వ్యక్తులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... పట్టణంలోని నగరిగుట్టకు చెందిన సాయిప్రసాద్, సాయి అనే ఇద్దరు కూలీలు విజయేంద్ర, సాయికుమార్‌లను ఆదివారం రాత్రికూలి డబ్బులు అడిగారు. ఈ విషయమై వీరి మధ్య మాటమాటపెరగడంతో సాయికుమార్, విజయేంద్ర అనే ఇరువురు సాయిప్రసాద్, సాయిలపై దాడి చేశారు. వీరితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

కోదండరామాలయం వద్ద తప్పిన ప్రమాదం



అగ్నికి ఆహుతి అవుతున్న మొబైల్ మరుగుదొడ్లు

ఒంటిమిట్ట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయం వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. టీటీడీ పరిపాలన కార్యాలయం సమీపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గత రెండు సంవత్సరాలుగా తుప్పు పట్టిన మొబైల్ మరుగుదొడ్లు ఉన్నాయి. వీటిని అధికారులు పాతసామన్లకు లెక్కకట్టి విక్రయించారు. సోమవారం సాయంత్రం వాటిని గ్యాస్‌కట్టర్‌తో విడగొడుతుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే టీటీడీ విజిలెన్స్ అధికారులు మంటలను ఆర్పారు. దీంతో టీటీడీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో భక్తులు ఆ ప్రాంతంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

● లేకపోతే మూల్యం చెల్లించక తప్పదు ● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధుల డిమాండ్



ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక దీక్షలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు ప్రభుత్వం వెంటనే మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వం తగుమూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సోమవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 500 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా 25 మంది నాయకులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష కొనసాగించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నుంచి మల్లు రఘునాథరెడ్డి దీక్షలో పాల్గొన్న మాన్యువల్ కౌన్సెలింగ్‌తో ఉపాధ్యాయులకు కలిగే లాభాన్ని.. అలాగే వెబ్ కౌన్సెలింగ్ వల్ల ఉపాధ్యాయులు కలిగే నష్టాన్ని వివరించారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు మొండి వైఖరిని ప్రదర్శిస్తూ ఉపాధ్యాయులకు నష్టం కలిగే విధంగా వెబ్ కౌన్సెలింగ్ చేపట్టడాన్ని ఖండిస్తూ ప్రభుత్వం తనతీరు ఇప్పటికైన మార్చుకోవాలని లేనిపక్షంలో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురవుతారన్నారు. కడప జిల్లా ఐక్యవేదిక నాయకులు మోపూరి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా ముందుగానే తీసుకువచ్చి ఈరోజు కేటాయించిన స్లాట్‌ల రూపంలో విద్యాశాఖ అధికారుల మీద ఒత్తిడి తెచ్చి ఉపాధ్యాయులను భయ భ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ఇలియాస్ బాష మాట్లాడుతూ ప్రభుత్వం మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టకపోతే మంగళవారం విజయవాడ విద్యా భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు గుజ్జల తిరుపాల్, సంగ మేశ్వర్ రెడ్డి, కొండారెడ్డి, అబ్దుల్లా, ఖాదర్ బాష, లెక్కల జమాల్‌రెడ్డి, బత్తిని నాగేశ్వర రావు,అమర్‌నాథరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె ఈఓ మళ్లీ సస్పెన్షన్

● చక్రాయపేట ఈఓపీఆర్డీ, పోరుమామిళ్ల ఈవో..

కడప, వేంపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఈఓగా పనిచేస్తున్న ఎన్‌వీ సుబ్బారెడ్డి రూ.1.86 కోట్ల పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని ఈ ఏడాది మార్చి 5వ తేదీ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ రాజ్యలక్ష్మి సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో కొనసాగు తుండగా తాజాగా పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఈఓ సుబ్బారెడ్డిని సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీపీఓ రాజ్యలక్ష్మి సోమవారం సుబ్బారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే వేంపల్లె ఈఓగా పనిచేసి ప్రస్తుతం చక్రాయపేట ఈఓపీఆర్‌అండ్ ఆర్డీగా పనిచేస్తున్న భూమిరెడ్డి మల్లికా ర్జునరెడ్డిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ ఇచ్చిన ఆదేశాలతో డీపీఓ సస్పెన్షన్ వేటు వేశారు. సుమారు రూ.15లక్షల మేర పంచాయతీ నిధులను ఖాతాల్లో జమచేయకుండా నిబంధనలకు విరుద్ధంగా తనవద్ద ఉంచుకున్నారనే ఆరోపణలపై సస్పెండ్ చేశారు. అలాగే గతంలో వేంపల్లెలో ఈఓగా పనిచేస్తూ పోరుమామిళ్లకు వెళ్లిన రవిశంకరరెడ్డిని సస్పెండ్ చేశారు. ఈయన సుమారు రూ.48లక్షలు పంచాయతీ నిధులు ఖాతాలో జమచేయకుండా ఏడాదిన్నర పాటు తనవద్దే ఉంచుకున్నారనే ఆరోపణలపై డీపీఓ సస్పెండ్ చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆటో వితరణ



ఆటోను నడుపుతున్న ముక్కా, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుగుంటపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ముక్కా ఫౌండేషన్ అధినేత, కుడా చైర్మన్ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆటోను విరాళంగా ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్‌తో కలిసి కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆటోను అందించారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే పట్టణం నుంచి సుమారు 4 కిలోమీటర్లు దూరం వెళ్లాలి. ఈ సమస్యను గ్రామస్తులు తన దృష్టికి తీసుకురావడంతో విద్యార్థుల ఇబ్బందిని గమనించి విద్యుత్ ఆటోను రూ.4 లక్షలతో కొనుగోలు చేసి కళాశాలకు అందజేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి చేసిన ఈ సహాయం అందరికీ స్ఫూర్తిదాయకం అని ప్రశంసించారు. అనంతరం ఆటోను ఎమ్మెల్యే స్వయంగా నడిపి కళాశాల యాజమాన్యంకు అందజేశారు. కార్యక్రమంలో టీడీ పీ యువ నాయకులు ముక్కా సాయి వికాష్‌రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురికి రిమాండ్

చాపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామానికి చెందిన ఏడుగురి వ్యక్తులను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టువారు వారికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో నలసింగు మధు, పెద్దకుళాయప్ప, పవన్, జంగయ్య, కిశోర్, బాబు, క్రిష్ణయ్య ఉన్నట్లు చెప్పారు. గతనెల 27వ తేదీ ఆ గ్రామం వద్ద ఉన్న బంజరు భూమి విషయమై అదే గ్రామానికి చెందిన పల్లెం శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యులు కట్టెలు, మచ్చుకత్తులు, ఇనుపరాడ్లతో ఘర్షణ పడ్డారన్నారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

నేడు అత్తిరాలలో గిరి ప్రదక్షిణ

రాజంపేటటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని అత్తిరాల మహాపుణ్యక్షేత్రంలో మంగళవారం సాయంత్రం ఆరు గంటల నుంచి గిరి ప్రదక్షిణ, గంగాహారతి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గంగాహారతి, అన్నదానం ఉంటాయని తెలిపారు.

పుంజుకుంటున్న టమోటా ధరలు

● 30 కిలోల టమోటా క్రేట్ రూ.820



అంగళ్లు మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

కురబలకోట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా పతనమైన టమోటా ధరలు క్రమేణా పుంజుకుంటున్నాయి. కొద్ది రోజుల క్రితం టమోటా ధరలు పాతాళానికి పడిపోవడంతో కనీసం గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు నష్టాలను చవిచూశారు. అయితే ప్రస్తుతం టమోటా ధరలు క్రమేణా పుంజుకొంటున్నాయి. కొన్ని రోజులుగా కేవలం 30 కిలోల క్రేట్ రూ.70 నుంచి రూ.150 మధ్య పలికింది. క్రమేణా పదిహేను రోజులుగా ధరలు పుంజుకుంటున్నాయి.

కాగా సోమవారం మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్‌లో 30 కిలోల క్రేట్ ధర రూ.820 పలికింది. కొనుగోలు చేసిన టమోటాలను మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా ప్రాంతాలకు తరలిస్తున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

లంకమల్లలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్



ఉప్పుల గుంతలో కూంబింగ్ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

సిద్దవటం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అభయారణ్యంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఆదేశాలతో ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రేళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్ట్ బీట్‌లలో సమస్యాత్మక, అనుమానిత అటవీ ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతంలోని సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనపడితే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం తెలపాలన్నారు. అటవీ సంపద కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతాలను అనుకుని ఉన్న పంట పొలాల్లోకి వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా గ్రామస్థులు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేశు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ త్యాగధనుల నుంచి
నేటి తరం స్ఫూర్తి పొందాలి



వీణా విజయరామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నేతలు

కడప ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ పోరాటంలో ఆనాటి త్యాగధనుల నుంచి నేటి తరం స్ఫూర్తి పొందాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాష అధ్యక్షతన ఎస్టీయూ 79 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వేడుకలలో ఎస్టీయు జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, వీణా విజయరామరాజు, ముఖ్దుం మొహిద్దీన్‌లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.సురేష్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి , జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వికలాంగులు, వృద్ధులకు 1, 2 తేదీల్లో పంపిణీ

చెన్నూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులు వినియోగదారులకు చౌకదుకాణాల ద్వారా ప్రతి నెలా 1, 2 తేదీల్లోనే పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దారు సరస్వతి అన్నారు. ఈ మేరకు చెన్నూరులో సోమవారం తహసీల్దారు మాట్లాడుతూ గతంలో ఎండీయూ వాహనాలు ఉన్నప్పుడు ఇంటి వద్దకే నిత్యావసర వస్తువులు పంపిణీ చే స్తున్నారని ఇప్పుడు ఎలా తీసుకోవాలి, అంతదూరం ఎలా వెళ్లాలా అన్న ఆలోచన వద్దని ఆమె అన్నారు. ప్రతి నెలా ఏ విధమైన ఇబ్బందులు లేకుండా నిత్యావసర వస్తువులను ఇంటి వద్దకే తీసుకెళ్లి ఇవ్వడం జరుగుతుందని ఆమె అన్నారు. లబ్ధిదారులు ఏ మాత్రం అధైర్యపడవద్దని ఆమె తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



సింహాద్రిపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలంలోని అంకాళమ్మ గూడూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు అరుణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం కామసముద్రం, అంకాళమ్మ గూడూరు గ్రామాలలో ఇంటింటికి వెళ్లారు ప్రచార కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి,రాజమోహన్‌రెడ్డి, మల్లేష్, ద్వారకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దాడులు అరికట్టడంలో విఫలం'

కడప సెవెన్ రోడ్స్‌జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు విమర్శించారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఐద్వా జిల్లా అ ధ్ య క్షు రా లు సుబ్బమ్మ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ముడియం చిన్ని, వీరణాల శివ కుమార్ మాట్లా డారు. డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్య దర్శి ఆదిల్, నగర కారయదర్శి విజయ్, అనంతమ్మ, దుర్గమ్మ పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తయ్యేనా..?

● అసంపూర్తిగా ఎల్లటూరు సచివాలయ నిర్మాణం ● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం ● అందుబాటులోకి తేవాలని కోరుతున్న ప్రజలు

పెండ్లిమర్రి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా 16 సచివాలయాల ఏర్పాటుకు గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. చెర్లోపల్లె, కొత్త సంగటిపల్లె గ్రామ పంచాయతీలకు కలిపి పెండ్లిమర్రిలో, అలాగే కొత్త గిరియంపల్లె గ్రామ పంచాయతీకి కలిపి తిప్పిరెడ్డిపల్లెలో సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే 15 సచివాలయాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. ఐదు సంవత్సరాలు దాటినా ఎల్లటూరు సచివాలయం నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ఒకేచోట సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్‌ల ఏర్పాటుకు గత ప్రభుత్వం దాదాపు కోటి రూపాయల నిధులను కేటాయించింది. సచివాలయానికి స్లాబు, రైతు భరోసా కేంద్రానికి పిల్లర్లు, విలేజ్ క్లీనిక్ పునాది దశలోనే ఆగిపోయాయి. ఇప్పుడు ఆ ప్రాంతమంతా కంప చెట్లతో నిండి ఉంది. కాంట్రాక్టర్లు మారారు. గత ప్రభుత్వంలో సరైన సమయానికి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు పూర్తి చేయలేక చేతులెత్తేశారు. ఇప్పుడు ఈ అసంపూర్తి నిర్మాణాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఈ అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయాలని ఎల్లటూరు పంచాయతీ ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతానికి ఎప్పటి నుండో ఉన్న పాత భవనంలోనే అన్ని శాఖల సిబ్బంది విధులు కొనసాగిస్తున్నారు.



పునాది దశలో ఆగిపోయిన విలేజ్ క్లీనిక్



స్లాబు దశలో ఆగిపోయిన సచివాలయం



పిల్లర్ల దశలో ఆగిపోయిన రైతు భరోసా కేంద్రం

కార్పొరేషన్‌లో
సమావేశ భవనం తెరిపించండి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశ మందిరానికి వేసిన తాళాలను తీయాలని మేయర్ సురేష్‌బాబు లిఖితపూర్వకంగా కమిషనర్‌కు తెలియజేశారు. సోమవారం కార్పొరేషన్ కమిషనర్ చాంబర్‌లో కార్పొరేటర్లు, మేయర్ సురేష్‌బాబు రాసిన లేఖలు కమిషనర్‌కు సమర్పించారు. అత్యవసర జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉందని లేఖలో తెలిపారు. అయితే సమావేశ మందిరంలో కనీస వసతులలు లేనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సమావేశ మందిరం తాళాలను తీయించినట్లయితే పరిశీలిస్తామని తెలిపారు.

ఆధార్ కేంద్రాన్ని
సద్వినియోగం చేసుకోండి

సీకేదిన్నె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని మార్పులు చేర్పులు చేసుకోవచ్చునని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె సచివాలయంలో మంగళవారం నుంచి 13 వతేదీ వరకు, 24 నుంచి 25 వరకు క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేయాలి

కమలాపురం రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని కమలాపురం ఈఆర్వో నీలమయ్య తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని ఆయన తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల సహకారంతో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేస్తామన్నారు. ప్రతి ఓటు కార్డును ఆధార్‌తో లింకు చేయాలన్నారు. వివాహితులైన వారివి, గ్రామాల్లో లేనివారివి, మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలన్నారు. ఇందుకు వారి కుటుంబ సభ్యులతో దరఖాస్తు చేయించి ఓట్లు తొలగించాలన్నారు. ఇంకా ఏవైనా డోరు నెంబరు మార్పు తదితరాలు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొత్త ఓటరు జాబితా రూపొందించడానికి ప్రతి పార్టీ నాయకుల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు శివరామిరెడ్డి, నాగేశ్వర్‌రావు, లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, సరస్వతి వివిధ పార్టీల నాయకులు దివాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్వో నీలమయ్య

అంగన్వాడీలను సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లలను అంగన్వాడీల్లో చేర్పి సద్వినియోగం చేసుకోవాలని వేంపల్లె సీడీపీఓ సునీత తెలిపారు. వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలో తల్లులు, గర్భిణుల సమావేశం నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. స్కూల్‌కు వెళ్లడానికి సిద్ధం చేయడం, 1వ తరగతిలో చేరాల్సిన పిల్లలకు ముందు అంగన్వాడీలో విద్యాబుద్ధులు చెబుతారని, పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ టీచర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి రామగిరి బాబా ఆరాధనోత్సవాలు

కడప కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భగవాన్ రామగిరి బాబా 162వ గురుపూజ ఆరాధన మహోత్సవాలను నగర అక్కాయపల్లె అంబాభవాని నగర్ అంబాభవాని గుడిలో ఈనెల 15వ తేదీ ఆదివారం నుంచి 19వ తేదీ గురువారం వరకు జరుగనున్నట్లు భగవాన్ రామగిరి బాబా సేవా సమితి అధ్యక్షుడు రాజభాస్కర్‌రావ్ షిండే, గౌరవాధ్యక్షుడు బి. హరిప్రసాద్ వెల్లడించారు. చివరిరోజున మధ్యాహ్నం 12 గంటలనుంచి ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేద్దాం

పులివెందుల రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేద్దామని మున్సిపల్ కమిషనర్ రాముడు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచ యోగాంధ్ర ర్యాలీ చేపట్టారు.

రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య

కడప క్రైమ్ జూన్ 9(ఆంధ్రజ్యోతి) : కడప కృష్ణాపురం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 70 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.6 ఉంటాడని తెలిపారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఏపీమధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ ఏఐటీయూసీ అనుబంధ కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, అధ్యక్షుడు వేణుగోపాల్, ఏపీమధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌బాష, మద్దిలేటి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో
పంటలు సాగు చేస్తే లాభదాయకం

శాస్త్రవేత్త డాక్టర్ కదిరివేల్, డాక్టర్ వీరయ్య

వల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికపరంగా ఈ ఆధునికయుగంలో పంటలు సాగు చేస్తే ఎంతో లాభదాయకమని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కదిరివేల్, డాక్టర్ వీరయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని తప్పెట్ల, పెద్దలేబాక గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కదిరివేల్ మాట్లాడుతూ నూనె గింజల పంటలు ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏవో సాయిజ్యోతి, డాక్టర్ సురేశ్ ,గిరీష్‌కుమార్, డాక్టర్ మాధవరెడ్డి, పలువురు పశువుల వైద్యులు, రైతులు పాల్గొన్నారు.

'ఏడాదిలో ప్రజలకు చేసింది శూన్యం'

పులివెందుల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిలో ప్రజలకు చేసింది శూన్యమని కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివెందుల సబ్‌జైల్‌లో ఉన్న వైసీపీ నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం ఏడాదిపాలన గడిచిందన్నారు. ఈ కాలంలో చేసింది శూన్యమన్నారు. కేవలం వైసీపీనాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారిపైన దొంగ కేసులు పెట్టడమే పనిగాపెట్టుకున్నారన్నారు. వైఎస్ విగ్రహం వద్ద టీడీపీ తోరణాలు ఏర్పాటుచేశారని కమిషనర్, డీఎస్పీకి ఫిర్యాదు చేయడంతో వారు పట్టించుకోకపోవడంతో వాటిని వైసీపీ నాయకులు తొలగించా రన్నారు. తోరణాలు, జెండాలను తొలగిస్తే 307 కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అమలు చేయాలి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ రూ.20వేలు పథకం వెంటనే అమలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడుకి వినతిపత్రం అందించారు. అ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

వేంపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కల్పించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు.సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు గాలి హరిప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి, బీజేవైఎం జిల్లాఉపాధ్యక్షుడు రవి యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో వెలుగులు వచ్చేదెన్నడు.?

కడప, సెవెన్ రోడ్స్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడమే ధ్యేయంగా ధైర్యంగా పనిచేసిన కార్మికుల జీవితాల్లో వెలుగు వచ్చేదెన్నడు అంటూ నిరసన ధర్నాలో నినదించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.లింగన్న, అంజనేయులు,ఆనందయ్య, ఓబులేసు, లక్ష్మయ్య ప్రతాప్, కళ్యాణ్, యొహోనా తదితరులు ఉన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

కడప మారుతీనగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురం పట్టణానికి చెందిన ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు,కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి 1200 పుస్తకాలను సోమవారం ఎల్ఐసీ కాలనీలోని తమ నివాస గృహంలో సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు హరిభూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్, హరిక్రిష్ణకు అందించారు. సిద్ధాంత వ్యాసాల సంపుటాలు, చిందోళ్ల చరిత్ర, సంస్కృతి సాహిత్యం, ముళ్లపూడి వెంకటరమణ రచనలు సమగ్ర పరిశీలన తదితర కవిసంపుటాలు ఉన్నాయి.

పల్లా శ్రీనివాస్ తండ్రికి ఘన నివాళులు



కడప ఎర్రముక్కపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణవార్త తెలుసుకొని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి విశాఖపట్టణం వెళ్లి నివాళుల ర్పించారు. సోమవారం విశాఖపట్టణం పల్లా శ్రీనివాస్ స్వగృహంలో ఆయనను కలిసి పరామర్శించారు. అలాగే పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్ ఏఎఫ్ఏయూలో యోగాంధ్ర 2025



కడప ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఆరోగ్యాన్ని ప్రోత్సహిం చేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేయబడింది. ఈ కార్యక్రమానికి వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ప్రధాన అతిథిగా హాజరై యోగా శారీరక, మానసిక, భావోద్వేగ సమతుల్యతకు దోహదపడే విశిష్టతను వివరించారు. మిత్ర యోగా సెంటర్‌కు చెందిన కె.కల్పన యోగాసనాలు తెలిపారు.

'దుర్మార్గానికి కారకులైన ప్రతి ఒక్కరినీ శిక్షించాలి'

కడప సెవెన్ రోడ్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అన్యాయంగా పేద వృద్ధురాలు పిచ్చమ్మ ఇంటి పన్ను మార్పు చేయడం ద్వారానే అక్రమార్కులు మరిన్ని అడ్డదారులు తొక్కుతూ దుర్మార్గంగా ఇంటి కూల్చివేతకు తెగబడ్డారని, కారకులైన ప్రతి ఒక్కరినీ శిక్షించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనం తరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు వెంకటశివ, గుర్రప్ప, డాక్టర్ శ్రీనివాసులు, ఓబయ్య, రాము.శ్రీకృష్ణ, ప్రసాద్, సీఆర్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు అంతా మాయ

ఖరీఫ్ ప్రారంభం అయినా రైతులకు అందని భూసార పరీక్ష ఫలితాలు

లింగాల,జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నేలస్వభావానికి అనుగుణంగా పంటలు సాగుచేస్తేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. నేల స్వభావం అందులో ఏ స్థాయిలో ప్రథమ పోషకాలున్నాయి, ద్వితీయ పోషకాలున్నాయి, సూక్ష్మపోషకాలు ఎంత వరకు ఉన్నాయి, నేల ఉదజని సూచిక, సేంద్రీయ కర్బణం ఇలా మొత్తం భూమిలో ఉన్న పోషక విలువలు గురించి రైతులకు తెలియజేసి, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించి ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేయాలి. సాధారణంగా ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో వ్యవసాయశాఖ అధికారులు రైతుల నుంచిమట్టి నమూనాలను సేకరిస్తారు. ఈ ఏడాది కూడా భూసార పరీక్షల కోసం రైతుల నుంచి మట్టినమూనాలను సేకరించారు. కానీ ఖరీఫ్ ప్రారంభం అయిన కూడా ఇంత వరకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను మాత్రం రైతులకు ఇవ్వలేదు. ప్రత సంవత్సరం ఇదే పరిస్థితి ఉత్పన్నమవుతోంది. టెస్టింగ్ కోసం మట్టినమూనాలను ల్యాబ్‌కు పంపితే వాటిని పరీక్షించి ఫలితాల పత్రాలు మండలాలకు పంపించే సరికి ఖరీఫ్ సీజన్ పూర్తి అయిపోయి రబీ సీజన్ కూడా ప్రారంభం అయి ఉంటుంది. రైతులు కూడా ఇటువంటి పరిస్థితులకు అలవాటుపడి తమకు తోచిన పంటలను సాగు చేసుకుంటున్నారు. మట్టి నమూనాలను పరీక్షించే ల్యాబ్ జిల్లాలోని ఊటుకూరులో ఒక్కటే ఉండడం జిల్లా వ్యాప్తంగా వేలల్లో మట్టినమూనాలు పరీక్షించాల్సి రావడం ఆలస్యానికి కారణం అవుతోంది. ప్రతి సంవత్సరం ఇదే విధంగా జరుగుతుండడంతో రైతులు భూసార పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూడకుండా తమకు అవగాహన ఉన్న మేరకు పంటలు సాగు చేసుకుంటున్నారు. పంటలకు ఎరువులను మోతాదుకు మించి ఉపయోగించడం, లేదా పంటలకు అవసరం అయిన ఎరువులను కాకుం డా అవసరం లేని ఎరువులను ఉపయోగించడం లాంటివి సర్వసాధారణంగా చోటుచేసుకుంటున్నాయి. తద్వారా ఆశించిన మేర దిగుబడులు పొందలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాగా సీజన్ పూర్తి అయ్యాక భూసార పరీక్షఫలితాలు ఇచ్చే కంటే సీజన్ ప్రారంభం లోనే ఇస్తే రైతులకు ఉపయోగం ఉంటుంది.



మట్టి నమూనాలను సేకరిస్తున్న దృశ్యం(ఫైల్)

ఫలితాలు వచ్చిన వెంటనే అవగాహన కల్పిస్తాం

మండలంలోని 9 రైతు సేవాకేంద్రాలనుంచి 630 నమూనాలు ల్యాబ్‌నకు పంపించాం. ఫలితాలు వచ్చిన వెంటనే రైతులకు ఎరువులు, పంటసాగుపై అవగాహన కల్పిస్తాం.

రమేశ్, ఏవో

సీడీపీవోగా హైమావతి



ముద్దనూరు, జూన్ 9(ఆంధ్ర జ్యోతి): ముద్దనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా హైమావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ప్రొద్దుటూరు అర్బన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీడీపీవో ముంతాజ్‌బేగం చాపాడుకు బదిలీపై వెళ్లారు.

గర్భిణులు జాగ్రత్త వహించాలి



గర్భిణులకు సూచనలు ఇస్తున్న వైద్యురాలు

దువ్వూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు నెలలు నిండే కొద్దీ జాగ్రత్త వహించాలని వైద్యురాలు వికసిత సూచించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత లేకుండా ప్రొటీన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్‌బాబు, రోహిణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతో దీర్ఘాయుష్షు

● యోగాంధ్ర పై అవగాహన ర్యాలీలు

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగాసనాలు సాధన చేయడంతో వ్యాధులు అదుపులో ఉండి దీర్ఘాయుష్షు పొందవచ్చునని డీఎల్‌డీవో సుబ్రమణ్యం అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సోమవారం యోగాంధ్ర ర్యాలీని మండల పరిధిలోని కొత్తపల్లె, గోపవరం పంచాయతీల్లో నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు కలిసి ఖాదర్‌బాద్ గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో సుబ్రమణ్యం మాట్లాడుతూ నిత్యం యోగాసనాలను సాధన చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు, రాజుపాలెంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, తదితరులు

ఈ సందర్భంగా ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఏపీవో గంగయ్య, ఏపీఎం అపర్ణ, సీసీ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో తహసీల్దారు దస్తగిరయ్య, ఎంపీడీవో భాస్కర్‌రావు, వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు, ఎస్‌ఐ వెంకటసురేశ్, టీడీపీ సీనియర్ నాయకుడు శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర పై అవగాహన ర్యాలీలు

కొండాపురం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రపై సోమవారం కొండాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ఆఫీసు నుండి స్టేట్‌బ్యాంక్ వరకు సాగిన ఈ ర్యాలీలో ఎంపీడీవో కార్యాలయం, సచివాలయం, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. యోగా చేయండి- ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ నినాదాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవో సుబ్బయ్య, ఎంఈవో రామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని సర్పంచ్ యనమల సుధాకర్, పంచాయతీ కార్యనిర్వాహణాధికారి రవిశంకర్‌రెడ్డి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ కార్యాలయం నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. యోగాపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరులో..

దువ్వూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో సోమవారం యోగాంధ్ర కార్యక్రమం గురించి ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుండి దువ్వూరు మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే కార్యక్రమంపై ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో హరికృష్ణయాదవ్, సర్పంచ్ చెన్నరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా సోమవారం అధికారులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు ఈ ర్యాలీ సాగింది.

బి.కోడూరులో..

బి.కోడూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు యోగా దినోత్సవం సందర్భంగా బి.కోడూరు నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని, దీంతో ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన యోగా పై సోమవారం టంగుటూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ పారిశుధ్య కార్మికులు కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ నెలలో జరిగే యోగా దినోత్సవంపై అవగాహన కోసమే ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణమ్మ, ఎంపీటీసీ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

జమ్మలమడుగు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పెన్నా నది గుంతల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం వచ్చిందంటే టూరిస్టులు, విద్యార్థులు, యువకులు ఈతకోసం సరదాగా పెన్నానదిలోకి వెళుతున్నారన్నారు. అలా వెళ్లి అక్కడ ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, కాబట్టి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, సహాయ కార్యదర్శి సిరివెళ్ల లక్ష్మీనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు విజయ్, నాగేంద్ర, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

కాశినాయన జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని మండల అధ్యక్షురాలు నల్లేరు పోలమ్మ అన్నారు. సోమవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో ఎంపీడీవో మైథిలీరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు వచ్చామా పోయామా అన్నట్లు కాకుండా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ మండల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సమావేశానికి కీలక శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీడీవో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ కలెక్టర్‌కు నివేదిక పంపుతానన్నారు. సమావేశంలో పలువురు అధికారులు తమ శాఖల అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య ఆచారి, బి.భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ వంగలి గౌసియా, గుర్విరెడ్డి, ఎంఈవో నిర్మల తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయం

పోరుమామిళ్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ విద్యారంగ సంక్షేమమే ధ్యేయంగా ఎస్టీయూ పని చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీఎస్ కమిటీ కన్వీనరు సుబ్రమణ్యం అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో సోమవారం ఎస్టీయూ ఆవిర్భావం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ముందుగా వీణా విజయరామరాజు, మొహియుద్దీన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగం పట్ల సరైన ధోరణి ప్రదర్శించడం లేదన్నారు. సీపీఎస్, జీవో 117 రద్దుతో పాటు ఐఆర్ ప్రకటన, పీఆర్‌సీ ఏర్పాటు, సకాలంలో డీఏ మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో బాలరాజు, పాకా చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పురాతన కృష్ణాలయం బాధ్యతను యాదవులకు అప్పగించాలి



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో మాట్లాడుతున్న ఆవుల దస్తగిరి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోకుల్‌నగర్‌లో ఉన్న పురాతన శ్రీకృష్ణ ఆలయం నిర్వహణ బాధ్యతలను యాదవులకు అప్పగించాలని తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటు అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి యాదవ్ సోమవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి విన్నవించారు. దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి వచ్చిన మంత్రిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకుల్‌నగర్‌లో ఉన్న క్రిష్ణాలయం నిర్వహణను యాదవులే చూసుకునేవారని, కాలక్రమంలో నిర్వహణ భారం కావడంతో దేవదాయ శాఖకు అప్పగించారని వివరించారు. దేవదాయ శాఖ ఆలయ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ వినతి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ త్వరగా చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విద్యార్థులకు త్వరగా చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు సోమవారం తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ముక్తియార్ అమ్మద్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు గత సంవత్సరం, ఈ సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను త్వరగా చెల్లించాలని కోరారు. విద్యా హక్కు చట్టంను రాష్ట్ర వ్యాప్తంగా పటిష్ఠపరచి సక్రమంగా అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మైనార్టీ స్కాలర్‌షిప్‌లను పునఃప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. అంగన్వాడీ సెంటర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హాస్టల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయుల పోస్టుల భర్తీతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యాకానుకలో నాణ్యమైన సామాగ్రిని అందించాలని కోరారు. కార్యక్రమంలో సలీం, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో సృజన్ విద్యార్థుల విజయం



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్-2025 ఫలితాల్లో సృజన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని డైరెక్టర్లు ఎ.సునీల్‌బాబు, కె.సృజన్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో బి.వీరఅభిజ్ఞాన్‌రెడ్డి 1062 ర్యాంకు సాధించగా, నవ్యశ్రీ 9034, డి.తేజేశ్వర్ 21090, ఎం.వంశీరెడ్డి 27447, వై.మన్సూర్ 27511, జి.నాగచందన 44583, జి.సమీరాభాను 34484 ర్యాంకు సాధించారని తెలిపారు. తమ వద్ద షార్ట్‌టర్మ్ కోచింగ్ తీసుకున్న విద్యార్థులు 92 శాతం మంది ఎంసెట్‌లో అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు అందక బతుకు భారం

● ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల ఆవేదన

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు అందక బతుకు భారంగా మారిందని ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు ఇల్లూరు సుబ్బన్న, బి.వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న బడుగు వికాసం అనే పథకంలో భాగంగా 2022లో ఎంఎస్‌ఎంఈ ద్వారా బస్సులు కొని ఆర్టీసీకు అద్దె ప్రాతిపదికన ఇవ్వడం జరిగిందన్నారు. బస్సులు కొనుగోలు సమయంలో ఒక్కో బస్సుకు రూ.15 లక్షల వరకు పెట్టుబడులు అప్పులు తెచ్చి ప్రారంభించామన్నారు. అప్పటి నుండి ఎటువంటి లబ్ధి ప్రభుత్వం నుండి రాకపోవడంతో వచ్చిన అరకొర అద్దెలతోనే వాయిదాలు కడుతూ జీవనం బరువుగా సాగిస్తున్నామన్నారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక, ప్రభుత్వం నుండి రావాల్సిన ప్రోత్సాహకాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే తమ బాధలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావులతో పాటు అధికారులను కలసి తమ బాధలను మొరపెట్టుకున్నామన్నారు. మే 15 లోపల పెండింగ్‌లో ఉన్న ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటన విడుదల చేయడంతో ఎంతో ఆశగా ఎదురుచుశామని, మళ్లీ జూన్ నెలలో విడుదల చేస్తామనడంతో నిరాశ చెందామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాయిదాలు వేయకుండా ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు విడుదల చేసి దళిత పారిశ్రామికవేత్తలను ఆదుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త చేస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయానికి తగ్గట్టు ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహకాలు విడుదల చేసి దళిత పారిశ్రామికవేత్తలను, వారి కుటుంబాలను ఆర్థికంగా నిలబెడతారని ఆకాంక్షిస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

స్కానింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

కలసపాడు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మాతృత్వ శిశు సంక్షేమ పథకం కింద స్త్రీలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్కానింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి శైలజ కోరారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు గర్భిణులకు ఉచిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెల 9, 10వ తేదీలలో ఈ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షల అనంతరం గర్భిణులకు డ్రైఫ్రూట్స్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయితేజ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ : కేసు నమోదు

ఖాజీపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలు గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఘర్షణ పడిన విషయంలో అయిదుగురిపై కేసు నమోదు చేశారు. ఆ వివరాల్లోకి వెళ్లితే... ఆంజనేయకొట్టాలు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మరో వర్గం వెంకటేశ్వరరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి ఇరువురు పీడబ్ల్యూడీ బంగ్లా సమీపంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ఫిబ్రవరి 1వ తేదీ ఘర్షణ పడి ఇనుపరాడ్లు, కట్టెలతో కొట్టుకున్న సంఘటనలో ఇరువురికి గాయాలు అయ్యాయి. డాక్టర్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అన్నదమ్ముల మధ్య చిన్నచిన్న ఘర్షణలు జరిగి జైలుపాలయ్యారని, అలా కాకుండా గ్రామాల్లో మధ్యవర్తిత్వం వహించి సమస్యలు పరిష్కరించుకుంటే వారి కుటుంబాలు బాగుంటాయని అన్నారు.

రామాంజనేయులు కుటుంబానికి ఉద్యోగం

● ఫారెస్టు రేంజర్ రఘునాధరెడ్డి

పోరుమామిళ్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నక్కలగండి వద్ద గుండెపోటుతో మృతి చెందిన బీట్ ఆఫీసర్ రామాంజనేయులు కుటుంబానికి ఉద్యోగం ఇప్పిస్తామని ఫారెస్టు రేంజర్ రఘునాధరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి రామాంజనేయులు కుటంబసభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు గాను ప్రభుత్వం తరపున ఇచ్చే రూ.25వేలు ఆర్థికసాయాన్ని రామాంజనేయులు సతీమణి రామసుబ్బమ్మకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్‌తో మాట్లాడి ఉద్యోగంతో పాటు ప్రభుత్వం నుండి అందాల్సిన అన్ని సౌకర్యాలను ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసరు రమణ, బీట్ అధికారులు కరుణాకర్, కిశోర్, వెంకటేశ్, హసన్‌బాషా, మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ గోవిందరెడ్డి రామాంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు.



రామాంజనేయులు అంత్యక్రియలకు ఆర్థికసాయం అందిస్తున్న ఫారెస్టు రేంజర్ రఘునాధరెడ్డి

మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై రోజు రోజుకు పెరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని నేషనల్ డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, తెలుగు రాష్ట్ర స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జయరాజ్ విమర్శించారు. మహిళలు, విద్యార్థినులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు సర్వసాధారణమయ్యాయని, ప్రస్తుతం ఇంట్లో, బయట రక్షణ లేకుండాపోయిందన్నారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థినిని హత్య చేయడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.